సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 3 । జూన్ । 2025



ఆకాశమే హద్దుగా..

II లో


కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి అల్లూరి వెంకట మురళీకృష్ణంరాజు, కల్యాణి దంపతులు (మలికిపురం) రూ.1,12,116 విరాళంగా అందజేశారు.

డెల్టాలకు 500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 కలిపి మొత్తం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 7,316 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్



సీపీవో వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న కలెక్టర్

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ టి.నిషాంతి, డీఆర్‌ఓ రాజకుమారి, డ్వామా పీడీ మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ, సర్వశిక్షా అసిస్టెంట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ జి.మమ్మీతో కలిసి ఆయన అర్జీదారు నుంచి 212 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారుల్లో విశ్వసనీయతను పెంపొందించాలని, గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అర్జీదారుడు తన అర్జీ స్థితిని ఆన్‌లైన్ పోర్టల్ లేదా 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ, అంతర్వేది బీచ్‌లో ఈ నెల మూడున జరిగే యోగా అభ్యసన గ్రాండ్ ఈవెంట్‌కు వివిధ శాఖల సిబ్బంది తరలిరావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పీకేపీ ప్రసాద్, డీఈవో షేక్ సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేస్తేనే సంతృప్తి

జిల్లా ఆర్థిక గణాంకాధికారి(సీపీవో) పి.వెంకటేశ్వర్లు ఉన్నత విలువలకు, సాటి ఉద్యోగులకు ఆదర్శమని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వెంకటేశ్వర్లును కలెక్టర్‌తో పాటు, జేసీ నిషాంతి, ఇతర జిల్లా అధికారులు సోమవారం సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బాధ్యతాయుతంగా ఉద్యోగంలో పని చేసినప్పుడే జీవితంలో సంతృప్తి కలుగుతుందన్నారు. ఉద్యోగ పదవీ విరమణ పొందిన వెంకటేశ్వర్లుతో పాటు, ఉప గణాంకాధికారి ఆర్.శంకర్రావు, రాజోలు, కపిలేశ్వరపురం తహసీల్దార్లు ఎన్ఎస్ఎస్ ప్రసాద్, పి.చిన్నారావును కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 18 అర్జీలు



ఫిర్యాదీ అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 18 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ పోలీస్ గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పోలీస్ గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించగానే ఎస్పీ కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. కొన్ని అర్జీలు ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలకు సంబంధించినవి ఉండడంతో వారికి ఎస్పీ కౌన్సెలింగ్ చేశారు.

‘మండే’ ఎండ

ఐ.పోలవరం: నైరుతి రుతు పవనాలు ప్రవేశించక ముందే తొలకరి పలకరించినా.. జిల్లావాసులపై భానుడి ప్రతాపం తగ్గలేదు. జనంపై పగపట్టినట్టు మరీ నిప్పులు కురిపిస్తున్నాడు. జిల్లాలో గడచిన రెండు రోజుల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం అమలాపురం, మండపేట, రాజోలు తదితర ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 38 డిగ్రీలు నమోదైంది. ఎండ చెలరేగడంతో సామాన్యులు అల్లాడుతున్నారు. తరచూ విద్యుత్ కోతలతో ఆపసోపాలు పడుతున్నారు. రాత్రి ఏడు గంటల సమయంలో కూడా ఉష్ణోగ్రత 35 డిగ్రీలు ఉండడం గమనార్హం. గత శుక్రవారం వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసి, జనం సేదదీరారు. రెండు రోజులుగా ఎండ వేడికి తాళలేకపోతున్నారు. ప్రధాన రోడ్లు, జాతీయ రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.



యానాం–ఎదుర్లంక వంతెన వద్ద నిర్మానుష్యంగా రోడ్డు

దుఃఖి సాగురం

వ్యవసాయం పండగ అనే పాలన ముగిసి వ్యవసాయం దండగ అంటున్న నేత పాలన మొదలై ఏడాది అవుతోంది. కూటమి ప్రభుత్వ ఈ ఏడాది పాలనా కాలంలో వ్యవసాయాన్ని నిజంగానే దండగగా మార్చే(శారు)స్తున్నారు. వరి సాగుకు సిద్ధమైతే.. ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్నదాత సుఖీభవ అందడం లేదు.. పంట నష్టపోతే పరిహారమూ దక్కడం లేదు.. ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే కొనుగోళ్లు ఆశించినంతగా లేవు. అరకొరగా కొంటున్నా, దానికీ సకాలంలో సొమ్ములు ఇవ్వడం లేదు. ఒక్క వరి పంట మాత్రమే కాదు.. ఉద్యాన, ఆక్వా పంటలకు సైతం లాభాల మాట అటుంచితే.. గిట్టుబాటు ధర కూడా రాక ఏడాది కాలం నుంచి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ దుఃఖ సాగరం నుంచి ఎప్పుడు బయటపడతామా అని భగవంతుడిని ప్రార్థిస్తున్నారు.

– సాక్షి, అమలాపురం



నాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సున్నా వడ్డీ రాయితీ పంపిణీ చేస్తున్న జిల్లా యంత్రాంగం (ఫైల్)



ముమ్మిడివరం మండలం కమినిలో వరదలకు నష్టపోయిన ఉద్యాన రైతులతో మాట్లాడుతున్న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

- నేడు అందని వ్యవసాయం
- ఏడాది కూటమి పాలనలో తిరోగమనం
- ఖరీఫ్ నష్ట పరిహారమూ లేదు
- ఇంకా అందని రబీ ధాన్యం సొమ్ము
- దిక్కులేని అన్నదాత సుఖీభవ గతేడాది బకాయిలు
- కనీస మద్దతు ధర దక్కకున్నా.. కానరాని స్పందన
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు సాగు భరోసా
- ఆర్బీకేలతో మరింత దన్ను
- క్రమం తప్పకుండా వారి ఖాతాలో రైతు భరోసా
- పంట నష్టపోయిన మూడు నెలల్లోనే పరిహారం

గ్రౌండ్ రిపోర్ట్ సాక్షి

ఐదేళ్ల కాలంలో రైతులకు అమలు చేసిన ప్రధాన పథకాల ద్వారా చేకూరిన లబ్ధి

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	చేకూరి లబ్ధి (రూ.ల్లో)
వైఎస్సార్ రైతు భరోసా	1,45,890 (ఏడాదికి సగటున)	482,58,00,000
వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ	1,07,272	15,63,00,000
పెట్టుబడి రాయితీ	1,08,176	93,37,19,127
ఉచిత పంట బీమా	2,89,745 (ఏడాదికి సగటున)	1,105,40,49,036
వైఎస్సార్ పంట బీమా	72,267	1,30,95,00,708
పశువుల బీమా	482	1,27,51,751

నాడు ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనా కాలంలో వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేశారు. నాణ్యమైన విత్తనం అందించడం నుంచి రైతు పండించిన ధాన్యం చివరి గింజ కొనుగోలు చేసే బాధ్యతను తీసుకుంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. రైతు భరోసా.. సున్నా వడ్డీ రాయితీ.. ఉచిత పంట బీమా.. ఆక్వా సర్వీసులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్, పశుక్రాంతి, ఉచిత పశువుల బీమా.. ఉద్యాన పంటలకు కోల్డ్‌స్టోరేజ్‌లు.. ప్యాక్ హౌస్‌లు వంటి సంక్షేమ పథకాల ద్వారా రైతులకు సాగు పెట్టుబడిని తగ్గించింది. ఆర్‌బీకేల ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక దన్ను, సాగు మెళకువలను అందుబాటులోకి తెచ్చింది. ఆర్‌కేబీల్లో ఆయా ప్రాంతాల్లో ఏ పంట సాగు ఎక్కువగా ఉందో గుర్తించి.. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్ఏ), విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్ (వీఎఫ్‌వో), విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ (వీవీఏ)లను నియమించారు. వీరు క్షేత్ర స్థాయిలో రైతులకు పలు రకాలుగా సహాయపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే.. తడిచి, దెబ్బతిన్న పంటను కొనుగోలు చేయడం, నష్టపోయిన తర్వాత పంట కాలంలోనే ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ), పంట బీమా పరిహారం అందించడం వంటి చర్యలతో రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. రైతు కళ్లాల వద్ద ధాన్యం కొనుగోలు, కష్టకాలంలో కొబ్బరి కొనుగోలు, ధర తగ్గిన కాలంలో ఆక్వాకు మద్దతు ధర ప్రకటన.. ఇలా ఆరుగాలం కష్టపడి పంట పండించిన అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచింది.

అన్నదాత సుఖీభవ ఒకేసారి ఇవ్వాలి



గత ఖరీఫ్ నష్టపోయాం. రబీలో లాభాలు రాలేదు. ఇప్పుడు ఖరీఫ్ సాగు చేయాలంటే పెట్టుబడులకూ రైతులు అప్పులు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఈ ఏడాది ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవతో పాటు, గతేడాది ఇవ్వాల్సిన సుఖీభవ సొమ్ము రెండూ కలిపి రూ.40 వేల చొప్పున అందించాలి. అప్పుడు రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఉండదు.

– నల్లా వెంకటేశ్వరరావు, రైతు, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

పాల వెల్లువకూ అడ్డంకి



రాయవరంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన బీఎంసీయూలోని పాల శీతలీకరణ యంత్రాలు

నాడు అలా..

జిల్లాలో తొలి దశలో ఐదు బీఎంసీయూల ద్వారా పాల సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్తపేట మండలం వాడపాలెం, రాయవరం, జెడ్.మేడపాడు, రావులపాలెం మండలం గోపాలపురం, అయినవిల్లి బీఎంసీల ద్వారా సేకరించేందుకు సన్నాహాలు చేశారు. వీటిలో రాయవరం, వాడపాలెం పక్కగా సిద్ధమయ్యాయి. ఒక్కొక్క బీఎంసీయూలో ఐదు వేల లీటర్ల చొప్పున రోజుకు 25 వేల లీటర్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 19 మండలాల్లో మొత్తం 195 ఏఎంసీయూలకు కిట్లు కూడా పంపించారు.

నేడు ఇలా..

పాడి రైతులు కోరుకున్న పాల పొంగుపై కూటమి ప్రభుత్వం నీళ్లు కుమ్మరించింది. అమూల్ పాల సేకరణ జరగకుండా విజయవంతంగా అడ్డుకుంది. గత ప్రభుత్వం నిర్మించిన బీఎంసీయూ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఏఎంసీయూల ఏర్పాటును విజయవంతంగా అడ్డుకుంది. పాల సేకరణ జరగకుండా సొంత కంపెనీతో పాటు, ప్రైవేట్ కంపెనీలు రైతులకు మెరుగైన ధర రాకుండా విజయవంతంగా అడ్డుకుంది.



రాయవరంలో తెరుచుకోని బీఎంసీయూ కేంద్రం

ధాన్యం సొమ్ము పడలేదు



నేను మే 24వ తేదీన ధాన్యం అమ్మకాలు చేశాను. మొత్తం పదకొండు కుంచాలలో వరిసాగు చేయగా, 55 బస్తాలు దిగుబడిగా వచ్చింది. నాకు బస్తాకు రూ.1,730 చొప్పున మొత్తం రూ.92,150 రావాల్సి ఉంది. గత తొమ్మిది రోజులుగా ధాన్యం సొమ్ము నా బ్యాంకు ఖాతాలో పడలేదు.

– మట్టా దుర్గారావు, కౌలు రైతు, ఈతకోట, రావులపాలెం మండలం



నేడు: ఇంత నష్టపోయినా పరిహారం లేదు. గతేడాది భారీ వర్షాలకు ఖరీఫ్‌లో నష్టపోయిన వరిచేలు

నేడు ఇలా..

- డెల్టాలో ఆయకట్టు రైతులు సాగు భరోసా కోల్పోయారు. మరీ ముఖ్యంగా వరి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. గత ఖరీఫ్‌లో కోతల సమయంలో వర్షాలు కురవడం వల్ల దిగుబడిని కోల్పోయారు. ధాన్యం రంగు మారిందని కనీస మద్దతు ధరకు కోత పెట్టారు. వారికి ఇవ్వాల్సిన నష్ట పరిహారం అందించలేదు.
- రబీలో పంట పండినా ప్రభుత్వ కొనుగోలు లేక రైతులు నష్టపోవడం గమనార్హం. జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో వరిసాగు జరగ్గా, 5.85 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడిగా వచ్చింది. ప్రభుత్వం తొలుత రెండు లక్షల మెట్రిక్ టన్నులు, తర్వాత మరో లక్ష మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని చెప్పింది. ఇప్పటి వరకు 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. రైతులకు రూ.633.52 కోట్లకు గానూ ఇంతవరకు రూ.364.43 కోట్లు చెల్లించారు.
- రైతుకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు అందిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. కానీ ఇంత వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.ఆరు వేల పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ముతోనే సరిపుచ్చింది. ఒక్కొక్క రైతుకు రూ.14 వేల చొప్పున జిల్లాలో 1,45,890 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ.204.24 కోట్ల సొమ్ము చెల్లించలేదు.



గత నెలలో సకాలంలో కొనుగోలు చేయని బొండాల రకం ధాన్యం

రాయితీ విద్యుత్‌కు వాతలు



తొమ్మిది గంటల పాటు పగటిపూట ఉచిత విద్యుత్

నాడు అలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ నిరంతరాయంగా అందించారు. అప్పట్లో జిల్లాలో మొత్తం 20,452 వ్యవసాయ మోటార్లు ఉండగా, వీటిలో 11,901 పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందింది. ఇక ఆక్వా చెరువులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు 6,001 కాగా, 4,277 సర్వీసులకు రాయితీ విద్యుత్ అందించారు.

నేడు ఇలా..

జిల్లాలో 5,970 వరకు ఆక్వా సర్వీసులుండగా, వీటిలో 4,870 రాయితీ సర్వీసులున్నాయి. ప్రభుత్వం రాయితీ విద్యుత్‌ను భారంగా మారేలా చేస్తోంది. ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో విద్యుత్ నిలిపివేయడంతో చెరువులోని రూప్ చందువాలు చనిపోయి రైతులు రూ.లక్షలు నష్టపోయిన విషయం తెలిసిందే. అదనపు వినియోగం, అపరాధ రుసుము కలిపి సర్వీసుకు రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తోంది. 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు రైతులు రూ.5 లక్షల నుంచి రూ. ఏడు లక్షల వరకు రైతులు భరించాల్సి వస్తోంది.



విద్యుత్ సర్వీస్ నిలిపివేయడంతో చనిపోయిన చేపలతో రైతులు ఆందోళన

రహదారిపై మృత్యుఘోష

- వడిశలేరు వద్ద ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- ఐదుగురి దుర్మరణం
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- కాకినాడ వెళ్లి వస్తుండగా ఘోరం
- రెండు కుటుంబాల్లో పెను విషాదం
- అతి వేగమే బలిగొందా?



ప్రమాదానికి కారణమైన ట్యాంకర్, కారు



తీగిరెడ్డి శివ, సాన్వి, భవాని (ఫైల్)

రంగంపేట/రాజానగరం/రాజమహేంద్రవరం రూరల్: అప్పటి వరకూ ఆనంద సాగరంలో ఓలలాడిన వారిని విధి చిన్నచూపు చూసింది.. కొద్దిసేపటిలో ఇంటికి చేరుకునేవారే.. అయినవారితో సంతోషంగా గడిపేవారే.. కానీ, అంతలోనే వారిపై మృత్యువు పంజా విసిరింది.. రహదారిపై మృత్యుఘోష ప్రతిధ్వనించింది.. రంగంపేట మండలం వడిశలేరు వద్ద ఏడీబీ రోడ్డుపై జరిగిన ఘోర ప్రమాదం రెండు కుటుంబాల్లో ఎప్పటికీ తీరని విషాదాన్ని నింపింది. అయినవారందరినీ శోక సంద్రంలో ముంచింది.

ఏం జరిగిందంటే..

ఈ ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు, గాయపడిన వారు దగ్గర బంధువులు. రాజానగరం మండలం రఘుదేవపురానికి చెందిన రేలంగి శివన్నారాయణ (40), ఆయన భార్య దేవీ లలిత (34), కుమార్తెలు వర్షిత (13), హర్షితతో పాటు.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కవలగొయ్యి గ్రామానికి చెందిన శివన్నారాయణ బావమరిది తీగిరెడ్డి శివ (30), ఆయన భార్య భవాని, వారి కుమార్తె సాన్వి (4) కలసి కారులో సోమవారం కాకినాడ బీచ్‌కు వెళ్లారు. అక్కడ ఆనందంగా గడిపారు. తిరిగి వస్తున్న క్రమంలో వడిశలేరు గ్రామ సమీపాన హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద వారు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న పాల ట్యాంకర్‌ను వేగంగా ఢీకొంది. ఆ వేగానికి కారు సగ భాగం ట్యాంకర్‌లోనికి చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న శివన్నారాయణ, దేవీ లలిత దంపతులు, వారి కుమార్తె వర్షిత, తీగిరెడ్డి శివ, ఆయన కుమార్తె సాన్వి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వెనుక సీటులో కూర్చున్న శివ భార్య భవాని, శివన్నారాయణ కుమార్తె హర్షిత తీవ్రంగా గాయపడ్డారు. వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కల్లు గీతపై ఆధారపడి ఈ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. శివ తండ్రి సూరిబాబు గత ఏడాది తాటిచెట్టు పైనుంచి పడి, మంచాన ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ ఘోరం జరగడం ఆయా కుటుంబాలను తీవ్రంగా కలచివేస్తోంది. సరదాగా బీచ్‌కు వెళ్లి వస్తామని చెప్పి వెళ్లిన వారు ఇలా కనుమరుగైపోతారనుకోలేదంటూ మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ప్రమాదంతో రెండు గ్రామాల్లోనూ విషాద ఛాయలు అలముకున్నాయి.

ఆధార్ ఇబ్బందులు తొలగిపోతాయనుకుంటే..

మృతుడు శివన్నారాయణ కుమార్తెలు హర్షిత, వర్షితలు కవల పిల్లలు. 13వ సంవత్సరంలోకి వచ్చారు. ఇద్దరూ ఒకే రూపంలో ఉండటంతో ఆధార్ అయ్యేది కాదు. ఈ క్రమంలో కాకినాడలో ఇందుకు సంబంధించిన పని చేసే వారున్నారని వారికి తెలిసింది. బీచ్‌లో సరదాగా గడిపిన అనంతరం వారు హర్షిత ఆధార్ పని పూర్తి చేసుకోవాలని వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఈ కవలల్లో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఆధార్ ఇబ్బందులు తొలగిపోతాయనుకుంటే ఇలా జరిగిందంటూ వారి బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

డైవర్షన్ గమనించలేదా?

ఏడీబీ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నారు. ఈ పనుల నేపథ్యంలో వడిశలేరు హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద అటుగా వెళ్లాల్సిన ట్రాఫిక్‌ను పక్క మార్గంలోకి డైవర్షన్ ఇచ్చారు. దీనికి కొద్ది దూరంలోనే పాల ట్యాంకర్ ఆగి ఉంది. ప్రమాద సమయానికి శివన్నారాయణ కారు నడుపుతున్నారు. ఆయన ఆగి ఉన్న ట్యాంకర్‌ను, డైవర్షన్‌ను గమనించకుండా వేగంగా దూసుకుని రావడం వల్లనే ఈ ఘోరం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జయిపోయింది. రహదారిపై డైవర్షన్‌ను గమనించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండకపోవచ్చని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోరాట పటిమ కార్యకర్తల సొంతం



మలికిపురం సభలో మాట్లాడుతున్న చిర్ల జగ్గిరెడ్డి. చిత్రంలో గొల్లపల్లి సూర్యారావు తదితరులు

- వారి కోసమే పార్టీ బాధ్యతలు తీసుకున్నా
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి
- వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

మలికిపురం: ప్రజా సమస్యలపై ఎటువంటి పోరాటానికైనా జెండా పట్టుకుని ముందుండేది ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మాత్రమేనని, అటువంటి పోరాట పటిమ తమ కార్యకర్తలకే సొంతమని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ మలికిపురంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ, నాడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ అనే విత్తనం వేస్తే, దానిని మానుగా మార్చింది కార్యకర్తలేనని స్పష్టం చేశారు. ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కొనైనా పార్టీని సగర్వంగా నిలిపిన కార్యకర్తలను ఎల్లప్పుడూ కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. తమ పార్టీ స్థాపించిన సమయంలో అన్ని రాజకీయ పార్టీలు తమకు తీవ్ర వ్యతిరేకంగానే ఉన్నాయని గుర్తు చేశారు. కార్యకర్తల కోసమే తాను పార్టీ జిల్లా బాధ్యతలు స్వీకరించానన్నారు. రాష్ట్రంలో కూటమి అరాచక పాలన నడుస్తోందని దుయ్యబట్టారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకూ శత్రువులకు కూడా ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత తమదని, దానికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ వాళ్లకు పథకాలు ఇవ్వొద్దని నేరుగా కూటమి పెద్దలే చెప్పడం దారుణమన్నారు. రాష్ట్రంలో పనిచేసి ఓడిన సీఎం ఎవరైనా ఉన్నారంటే అది తమ అధినేత మాత్రమేనని జగ్గిరెడ్డి అన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీటీసీ సభ్యులు బల్ల ప్రసన్నకుమారి, కుసుమ వనజకుమారి, ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ మండల అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, కట్టా శ్రీనివాసరావు, అడబాల బ్రహ్మాజీరావు, కుసు చంద్రశేఖర్, కేఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, జంపన బుజ్జీరాజు, జాన శంకరరావు, రుద్రరాజు చిన్నరాజా, ఈదరవిరెడ్డి, దొంగ నాగసత్యనారాయణ, ముప్పర్తి త్రిమూర్తులు, కూనపరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా..

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌-2025 ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విశేష ప్రతిభ
- జిల్లా విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు
- మరిన్ని విజయాలు సాధిస్తామంటున్న ర్యాంకర్లు

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాలలో జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. చదువులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ.. ముందుకు దూసుకుపోతామని ఆత్మవిశ్వాసం చూపుతున్నారు. ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి.. తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటామని అంటున్నారు. వారి మాటల్లోనే..

రాజమహేంద్రవరం రూరల్‌



పేరు: కంచుమర్తి ప్రణీత్‌, రాజమండ్రి
ర్యాంకు: 2 (ఎస్సీ కేటగిరీ), 311(ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: ప్రతాప్‌జీవన్‌, ఏడీ, అగ్రికల్చర్‌
తల్లి: మీనా, ఏవో, అగ్రికల్చర్‌
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి సాఫ్ట్‌వేర్‌ ఇంజినీరవుతా.



పేరు: దువ్వి ఆశిష్‌ సాయి శ్రీకర్‌, రాజమండ్రి
ర్యాంకు: 371 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: డాక్టర్‌ దువ్వి శ్యామ్‌ కిరణ్‌, వైద్యులు
తల్లి: డాక్టర్‌ నీలపాల పద్మజ, వైద్యులు
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ అవుతా.



పేరు: కోడూరి యశ్వంత్‌ రామ్‌, మానేపల్లి
ర్యాంకు: 480 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: నాగ వెంకటరత్నం, ప్రభుత్వ టీచర్‌
తల్లి: సత్యవేణి, గృహిణి
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ అవుతా.



పేరు: కోటిపల్లి యశ్వంత్‌ సాత్విక్‌, పాలకొల్లు
ర్యాంకు: 8(ఈడబ్ల్యూఎస్‌), 113(ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: వెంకటసత్యనారాయణ, ఫ్రూట్స్‌ బిజినెస్‌
తల్లి: గీతావాణి, గృహిణి
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదువుతా.



పేరు: ద్వామాడ హర్షవర్ధన్‌, రాజమండ్రి
ర్యాంకు: 368 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: వీరవెంకట సత్యనారాయణ, జీఎంఆర్‌ ఇంజినీర్‌
తల్లి: రత్నకుమారి, గృహిణి
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదువుతా.



పేరు: యార్లగడ్డ దేవీష్‌రుత్విక్‌, రాజమండ్రి
ర్యాంకు: 577 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: డాక్టర్‌ సురేష్‌, వైద్యులు
తల్లి: డాక్టర్‌ తనూజాదేవి, వైద్యులు
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి ఎంటర్‌పెన్యూర్‌ అవుతా.

సత్తా చాటిన అన్నదమ్ములు



కొడవటి రామ్‌ ప్రత్యూష్‌

కె.గంగవరం: ప్రముఖ ఐఐటీల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో కె.గంగవరానికి చెందిన కొడవటి ప్రసాద్‌చౌదరి (విశ్రాంత ఉపాధ్యాయుడు) మనవడు సువర్ణ రామ్‌ప్రత్యూష్‌కు అత్యుత్తమమైన ఆలిండియా 510 ర్యాంక్‌ సాధించినట్టు కుటుంబ సభ్యులు సోమవారం విలేకరులకు తెలిపారు. గతేడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో అతని అన్నయ్య కొడవటి సాయిప్రణీత్‌ ఆలిండియా 565 ర్యాంక్‌ సాధించడం గమనార్హం. తమ ఇద్దరు కుమారులు ప్రఖ్యాత ఐఐటీ కాలేజీల్లో సీట్లు సాధించడంపై తండ్రి కొడవటి సురేష్‌ (డీఈ, ఏపీ ట్రాన్స్‌కో), తల్లి వసుధ (సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌)తో పాటు, తాతయ్య కొడవటి ప్రసాద్‌చౌదరి, సుశీల, ఇతర కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యూష్‌ మీడియాతో మాట్లాడుతూ, ప్రతి వారం పరీక్ష రాసి, పొరపాట్లు సరిదిద్దుకోవటం, సందేహాల నివృత్తి, సమయ పాలన, రోజుకు 14 గంటలు శ్రమించడం వంటివి తన విజయానికి ప్రధాన కారణాలుగా తెలిపారు.

కరుణకు ఆలిండియా నాలుగో ర్యాంక్‌



దామలంక కరుణ

బాలాజీచెరువు (కాకినాడ): నగరానికి చెందిన దామలంక కరుణ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా రిజర్వ్‌ కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐఐటీ ముంబైలో సీఎస్‌ఈ అభ్యసించాలనేది తన లక్ష్యమని పేర్కొంది. ఆలిండియా రిజర్వ్‌ కేటగిరీలో నాలుగో ర్యాంక్‌ సాధించడం సంతోషంగా ఉందని చెప్పింది. ఇంటర్మీడియెట్‌లో రెగ్యులర్‌ సిలబస్‌తో పాటు, ఈ పరీక్షకు సంబంధించి ప్రతిరోజు సమయం కేటాయించి సాధన చేయడం తన విజయానికి కారణమని తెలిపింది. ఆమె తండ్రి సుబ్బారావు వ్యవసాయం చేస్తుండగా, తల్లి మంగాదేవి గృహిణి.

రైతు బిడ్డకు 1911 ర్యాంకు



చంద్రనారాయణతో కుటుంబ సభ్యులు

ఆలమూరు: మండలంలోని చెముడులంకకు చెందిన రైతు బిడ్డ నాగిరెడ్డి తేజ చంద్రనారాయణ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా 1911 ర్యాంకు సాధించాడు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్‌ చదివిన అతడు ఇంటి వద్దే స్వీయ శిక్షణ పొందాడు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్‌ ఇంజినీరింగ్‌ చదివి, అత్యున్నత ఉద్యోగం సాధించేందుకు కృషి చేస్తానని అతను తెలిపాడు. ఇదే కుటుంబంలో తేజ చంద్రనారాయణ సోదరి శ్రావణి 2022లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1800వ ర్యాంకును సాధించి, ప్రస్తుతం మద్రాసు ఐఐటీలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సరస్వతీ కటాక్షం కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాసు, నాగ అరుణ దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

శృంగవృక్షం విద్యార్థికి 276వ ర్యాంకు



శంకర్‌ మాణిక్‌

తొండంగి: జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షలో శృంగవృక్షానికి చెందిన కొంజెర్ల శంకర్‌మాణిక్‌ 276 ర్యాంకు సాధించాడు. రాజమండ్రిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న మాణిక్‌ ఉత్తమ ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు. ముంబై ఐఐటీలో చేరుతానని శంకర్‌ మాణిక్‌ తెలిపాడు.

క్లుప్తంగా

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి



ఆరుగొల్లు పండు (ఫైల్‌)

నిడదవోలు రూరల్‌: కోరుమామిడి గ్రామంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎల్‌.బాలాజీ సుందరరావు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు, కోరుమామిడి గ్రామానికి చెందిన ఆరుగొల్లు చంద్రరావు కుమారుడు పండు(21) గేదెల వ్యాపారం చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం నిడదవోలు నుంచి బైక్‌పై ఇంటికి వెళుతుండగా, ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి పిట్టా సందీప్‌ కోరుమామిడి కంచాలమ్మ అమ్మవారి గుడి సమీపంలో పండును వేగంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన పండును నిడదవోలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ మేరకు అతడి తండ్రి చంద్రరావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు జమ

- దేవస్థానం అధికారుల ఒత్తిడితో కాంట్రాక్టర్‌ చెల్లింపు
- ఊపిరి పీల్చుకున్న 349 మంది సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్‌

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 349 మంది పారిశుధ్య సిబ్బందికి ఏప్రిల్‌ నెల వేతనాలు ఎట్టకేలకు చెల్లించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సిబ్బంది ఖాతాలకు సొమ్ము జమ అయింది. మే నెల గడిచినా ఏప్రిల్‌ వేతనాలను పారిశుధ్య సిబ్బందికి చెల్లించకపోవడంపై ×వీరి కష్టం తుడిచే వారేరి¤ శీర్షికన మే 26న వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన దేవస్థానం అధికారులు మే 28న సంబంధిత కనకదుర్గా ఏజెన్సీస్‌ కాంట్రాక్టర్‌కు జీతాలు చెల్లించేందుకు రూ.58 లక్షలు చెల్లించారు. మరో రూ.లక్ష తనకు రావాల్సి ఉందని, అది వస్తే కానీ తాను జీతాలు చెల్లించనంటూ కాంట్రాక్టర్‌ భీష్మించడంతో.. కార్మికుల వేతనాలు మరింత ఆలస్యమయ్యాయి. దీనిపై ఇలాగైతే మేమెలా బతకాలి శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది.

అధికారుల ఒత్తిడి

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంపై దేవస్థానం అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో ఆదివారమే కార్మికుల అకౌంట్లకు వేతనాలు జమ కావాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేయడంతో.. గత్యంతరం లేక ఆదివారం రాత్రి 11 నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సిబ్బంది అకౌంట్లలో నగదు జమ అయింది. వరుసగా రెండు నెలల జీతాలు ఆలస్యం కావడంపై దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. మే నెల జీతాలైనా జూన్‌ పది కల్లా చెల్లించేలా చూడాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.


సాక్షి
ఇలాగైతే మేమెలా బతకాలి?

ఆదివారం సాక్షిలో ప్రచురితమైన వార్త

నలుగురికి అందని వేతనాలు

కాగా, దేవస్థానంలో నలుగురు పారిశుధ్య కార్మికులకు మార్చి వేతనాలు ఇంకా చెల్లించలేదు. గత నెలలో అందరికీ మార్చి వేతనాలు చెల్లించగా, వీరికి అందలేదు. సాంకేతిక కారణాలతో జమ కాలేదని, వచ్చే నెల చెల్లిస్తామని చెప్పినట్లు వారు తెలిపారు. వీరికి మార్చి బకాయి చెల్లించకుండా, ఏప్రిల్‌ వేతనాలు మాత్రమే చెల్లించారు.

కోనసీమ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



భరద్వాజ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కొత్తపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్‌-2025లో కోనసీమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఓపెన్‌ కేటగిరీ ఆలిండియా స్థాయిలో తమ సత్తా చాటారు.

భరద్వాజ్‌కు ఆలిండియా 82 ర్యాంక్‌

కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం గ్రామానికి చెందిన తోరాటి భరద్వాజ్‌ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఓపెన్‌ కేటగిరీ ఆలిండియా స్థాయిలో 82వ ర్యాంక్‌ను, ఈడబ్ల్యూఎస్‌లో ఐదో ర్యాంకు సాధించాడు. గ్రామీణ వ్యవసాయ కుటుంబానికి చెందిన తోరాటి శివ, పుష్ప దంపతుల కుమారుడైన భరద్వాజ్‌ పదో తరగతి వరకూ అమలాపురం, ఇంటర్మీడియెట్‌ విజయవాడలో చదివాడు. ముంబై ఐఐటీలో సీఎస్‌ఈ సీటు సాధించి కంప్యూటర్‌ ఇంజినీర్‌ కావడమే తన లక్ష్యమని భరద్వాజ్‌ తెలిపాడు.


మణిదీప్‌వర్మకు ఆలిండియా 386



ముదునూరి మణిదీప్‌వర్మ

ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి మణిదీప్‌వర్మ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఓపెన్‌ కేటగిరీ ఆలిండియా స్థాయిలో 386 ర్యాంక్‌ను, ఈడబ్ల్యూఎస్‌లో 21 ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ముదునూరి శ్రీనివాస రాజు, మాధవీ ఝాన్సీ దంపతుల కుమారుడైన మణదీప్‌వర్మ రాజమహేంద్రవరం, విజయవాడల్లో ఇంటర్మీడియెట్‌ వరకు చదివాడు. ముంబై ఐఐటీలో సీఎస్‌ఈ సీటు సాధిస్తానని భరద్వాజ్‌ తెలిపాడు. కంప్యూటర్‌ ఇంజినీర్‌ కావడమే తన లక్ష్యమన్నాడు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాకేత్‌కు 1393 ర్యాంకు



నెక్కంటి సాకేత్‌

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన నెక్కంటి సాకేత్‌ జేఈఈ అడ్వాన్స్‌ ఫలితాల్లో 1393వ ర్యాంకు సాధించాడు. దేశ రాజధాని ఢిల్లీ ఐఐటీలో ఇంజినీరింగ్‌ విద్యను అభ్యసించడమే లక్ష్యమని సాకేత్‌ తెలిపాడు. సాధారణ కుటుంబంలో జన్మించిన సాకేత్‌కు సర్వత్రా అభినందనలు వెల్లువెత్తాయి.

దేవీ మీనాక్షికి 19వ ర్యాంక్‌



దేవీ మీనాక్షి

అమలాపురం టౌన్‌: జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షల్లో అమలాపురం నారాయణ జూనియర్‌ కళాశాల విద్యార్థిని రెడ్డి దేవీ మీనాక్షి ఆలిండియా 19వ ర్యాంక్‌ సాధించింది. పీఈఆర్‌ఈపీ-ఓబీసీ-ఎన్‌సీఎల్‌-పీడబ్ల్యూడీ విభాగంలో ఆమె ఈ ర్యాంక్‌ పొందింది. గతంలో జేఈఈ మెయిన్స్‌లో ఆమె ఆలిండియా 176వ ర్యాంక్‌ సాధించింది.

సంధిపూడి విద్యార్థికి ఆలిండియా 1533 ర్యాంకు



తోట మోహన్‌ నాగవీరవెంకటరాజు

ఆలమూరు: మండలంలోని సంధిపూడికి చెందిన తోట మోహన్‌ నాగవీరవెంకటరాజు జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షల్లో ఆలిండియా ఓపెన్‌ కేటగిరీలో 1533 ర్యాంకు సాధించాడు. గత ఏప్రిల్‌ 19న విడుదలైన జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో 3557 ర్యాంకు సాధించి అందరినీ అబ్బురపరిచాడు. వెంకటరాజు టెన్త్‌ రాజమహేంద్రవరంలో, ఇంటర్మీడియెట్‌ విజయవాడలో అభ్యసించాడు. ప్రముఖ జాతీయ విశ్వవిద్యాలయంలో సీటు పొంది, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతానని వెంకటరాజు తెలిపారు. తల్లి భవానీ సర్పంచ్‌ కాగా, తండ్రి వెంకటేశ్వర్లు రాజకీయవేత్తగా ఉన్నారు.

చిరంజీవిని కుమారి మృతికి ప్రముఖుల సంతాపం

వైద్య కళాశాలకు భౌతికదేహం అందజేత



చిరంజీవిని కుమారి భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న వేణుగోపాలకృష్ణ



మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎంపీ వంగా గీత శ్రద్ధాంజలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రముఖ విద్యావేత్త డాక్టర్‌ పి.చిరంజీవిని కుమారి భౌతికదేహాన్ని సోమవారం పలువురు ప్రముఖులు సందర్శించారు. అభిమానులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ప్రతాప్‌నగర్‌లోని ఆమె స్వగృహం నుంచి ఇంద్రపాలెం లాకుల వద్దనున్న ఐడియల్‌ కళాశాలకు ఉదయం 11 గంటలకు తీసుకువచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఆమె భౌతికకాయాన్ని రంగరాయ వైద్య కళాశాలకు ఊరేగింపుగా తీసుకెళ్లి అందజేశారు. ఆమెకు సంతాపం తెలిపిన వారిలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, మాజీ వీసీలు డాక్టర్‌ జీవీఆర్‌ ప్రసాదరాజు, కె.పద్మరాజు, మురళీకృష్ణ, ప్రగతి విద్యా సంస్థల చైర్మన్‌ పి.కృష్ణారావు, మాజీ రిజిస్ట్రార్‌ వి.రవీంద్ర, కుడా మాజీ చైర్మన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సీపోర్టు సీఈఓ మురళీధర్‌, జెడ్పీ చైర్మన్‌ దున్నా జనార్దనరావు, పూర్వ విద్యార్థులు, సాహిత్యాభిమానులు ఉన్నారు.


ధాన్యం వ్యాపారి పరారీ!

ప్రత్తిపాడు రూరల్‌: తమ ధాన్యం సొమ్ము తీసుకుని ఓ వ్యాపారి పరారయ్యాడని మండలంలోని ధర్మవరం జువ్వల రామాలయం వద్ద సోమవారం పలువురు ధాన్యం రైతులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన 26 మంది రైతుల వద్ద నుంచి రూ.27 లక్షల విలువైన 2,900 బస్తాల ధాన్యాన్ని గ్రామానికి చెందిన నక్కంటి శ్రావణ్‌కుమార్‌ కొనుగోలు చేసినట్టు చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా తమ సొమ్ము చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు.

క్రీడా పాఠశాల అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్‌ (కాకినాడ సిటీ): వైఎస్సార్‌ కడప జిల్లాలో ఆంధ్రప్రదేశ్‌ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌ క్రీడా పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 4, 5 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్‌ సోమవారం ఇక్కడ తెలిపారు. 4వ తరగతికి 2015 ఏప్రిల్‌ ఒకటి నుంచి 2017 మార్చి 31 మధ్య, 5వ తరగతికి 2014 ఏప్రిల్‌ ఒకటి నుంచి 2016 మార్చి 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఈ నెల 19లోపు ఆసక్తి ఉన్నవారు httpr://aprportrrchoo.ap.gov.in/లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు జాబితాను జూలై ఒకటి నుంచి మూడు వరకు ఆయా జిల్లాల డీఎస్‌ఏల్లో జరిగే ఎంపికలకు ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

తిరుమల విద్యార్థుల ప్రభంజనం



అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్‌: ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్‌ మెడికల్‌ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్‌ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్‌ రెండో ర్యాంకు, కె.యశ్వంత్‌ సాత్విక్‌ ఎనిమిది, ఇ.వర్షిత్‌ 12, ఎం.సుమంత్‌దొర 38, కె.అభినవ్‌ 42, జి.సుజోష్‌రాజ 43, జి.అఖిల్‌సాయి 45, తుమాటిపూజిత అఖిల్‌ రాజ్‌కుమార్‌ 85, కప్పల వెంకటరామవినీష్‌ 127, పాతపాటి వెంకటవివేక్‌వర్మ 132, ముప్పల లిఖిత 137 ర్యాంకులు సాధించారని వివరించారు. ఇంకా 165, 174, 193, 195, 231, 238, 246, 270, 275, 276 ర్యాంకులు సాధించారన్నారు. వెయ్యిలోపు 69, మూడు వేలలోపు 201, ఐదు వేలలోపు 333, పది వేలలోపు 456 మంది ర్యాంకులు సాధించారని చెప్పారు. 260 మంది పైన విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించగలరని తెలిపారు. ర్యాంకర్లను తిరుమలరావు, అకడమిక్‌ డైరెక్టర్‌ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్‌ వి.శ్రీహరి అభినందించారు.

బండారులంకలో రేషన్‌ బియ్యం పట్టివేత

డ్రైవర్‌, ఇద్దరు డీలర్లపై కేసు నమోదు



పోలీసులు సీజ్‌ చేసిన బియ్యం వ్యాన్‌

అమలాపురం రూరల్‌: బండారులంక గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 55 బస్తాల బియ్యం లోడుతో వెళుతున్న వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. సరకును స్వాధీనం చేసుకుని, వ్యాన్‌ సీజ్‌ చేసి, డ్రైవర్‌తో పాటు, ఇద్దరు రేషన్‌ డీలర్లపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, రూరల్‌ మండలం బండారులంక గ్రామంలో రేషన్‌ షాపుల వద్ద బియ్యాన్ని వ్యాన్‌లో లోడ్‌ చేసి తరలిస్తుండగా, సోమవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించారు. వాహనాన్ని అడ్డగించి, పోలీసులకు, సివిల్‌ సప్లైస్‌ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని, విచారణ చేపట్టారు. ఈ వ్యాన్‌లో 50 కేజీల వంతున 55 బస్తాల్లో రేషన్‌ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. వాహనాన్ని తాలూకా పోలీస్‌ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ ఎ.సత్యనారాయణ, రేషన్‌ డీలర్లు సుగ్గు మాణిక్యాలరావు, కాశిన సుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు.

ప్రతిభ కనబర్చిన శుభశ్రీవల్లికి అభినందనలు



తల్లిదండ్రులుతో శుభశ్రీవల్లి ఆత్రేయి

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన యానాల శుభశ్రీవల్లి ఆత్రేయి జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్‌ కేటగిరీలో 296 ర్యాంక్‌ సాధించింది. కాకినాడలోని ఆదిత్య కళాశాలలో ఇంటర్మీడియెట్‌ చదివిన ఆత్రేయి ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌లో 99.96 స్కోర్‌తో ప్రతిభ కనబర్చింది. తండ్రి యానాల సాయికృష్ణ ఎస్‌బీఐలో చీఫ్‌ అసోసియేట్‌గా, తల్లి అచ్చియ్యమ్మ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం అదృశ్యం



భార్యాబిడ్డలతో తేజనవీన్‌

పెరవలి: వ్యాపారం కలసి రాక, అప్పులు తీర్చలేక, అప్పు ఇచ్చినవారి ఒత్తిడి తట్టుకోలేక ఓ కుటుంబం అదృశ్యమైన సంఘటన సంచలనం కలిగించింది. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముత్యాలవారిపాలెం గ్రామానికి చెందిన గంటా తేజనవీన్‌ తణుకులో గిఫ్ట్‌ ఆర్టికల్స్‌ షాపు నిర్వహించేవాడు. వ్యాపార, కుటుంబ అవసరాల కోసం రూ.25 లక్షలు అప్పులు చేశాడు. అప్పు ఇచ్చినవారు బాకీ తీర్చమని ఒత్తిడి చేయసాగారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం కుటుంబం సహా బయటకు వెళ్లిన తేజనవీన్‌ తిరిగి ఇంటికి చేరలేదు. ఈ మేరకు తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. తేజనవీన్‌, అతని కుటుంబ సభ్యులు కనిపిస్తే తమకు 94407 96642 లేదా 91548 75611 నంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

బంగారం, నగదుతో ఉడాయించిన వ్యక్తి అరెస్ట్‌

రూ.6.53 లక్షల సొత్తు రికవరీ

అమలాపురం టౌన్‌: పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గంగుమళ్ల కాసుబాబు వద్ద నుంచి బంగారు నగలు, నగదు తీసుకెళ్లి, పత్తా లేకుండాపోయిన కంతేటి రాజాను సోమవారం అరెస్ట్‌ చేసినట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు, వ్యాపారవేత్త కాసుబాబు వద్ద అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన కంతేటి రాజా ఐదేళ్లుగా క్లర్క్‌ కం అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ఆ నమ్మకంతోనే గత నెల 26న కాసుబాబు అతడికి 322 గ్రాముల బంగారు నగలు, రూ.2.25 లక్షల నగదు ఇచ్చి ముమ్మిడివరంలోని ఓ వాణిజ్య బ్యాంక్‌కు పంపించారు. నగలు, నగదుతో వెళ్లిన రాజా మళ్లీ కనిపించలేదు. దీంతో మరుసటి రోజు కాసుబాబు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు రాజా కోసం గాలిస్తున్నారు. సోమవారం స్థానిక సావరం రోడ్డులో తచ్చాడుతున్న రాజాను అరెస్ట్‌ చేసి, అతడి వద్ద నుంచి రూ.6.53 లక్షల విలువైన 217 గ్రాముల బంగారు నగలను రికవరీ చేసినట్టు సీఐ వీరబాబు తెలిపారు.